గ్రూప్ - 2 కరెంట్ అఫైర్స్ స్పెషల్

జనవరి - డిసెంబర్

జాతీయం

- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కార్యక్రమాన్ని యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ జూన్ 3న రాజస్థాన్‌లోని బాన్స్‌వడ జిల్లాలో ప్రారంభించారు. స్వర్ణ జయంతి గ్రామీణ స్వరోజ్‌గార్ యోజనను పునర్‌వ్యవస్థీకరించి ఈ పథకంగా మార్పు చేశారు.
- గర్భిణీ స్త్రీలకు ఉచిత ప్రసవ సేవలు, మందులు అందించేందుకు ఉద్దేశించిన 'జననీ శిశు సురక్షా' కార్యక్రమాన్ని యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ హర్యానాలోని మెపత్‌లో జూన్ 1న ప్రారంభించారు.
- దేశ తలసరి ఆదాయం 2010-11 ఆర్థిక సంవత్సరంలో ₹ 54,835కు చేరినట్లు కేంద్ర గణాంక సంస్థ వెల్లడించింది. 2009-10లో తలసరి ఆదాయం ₹49,492గా ఉండేది. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా తలసరి ఆదాయాన్ని లెక్కించారు. 2004-05 ధరల్లో గత ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం ₹35,915.
- కేంద్ర ప్రభుత్వం ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ వయోపరిమితిని కేంద్రం 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించింది. అలాగే 80 ఏళ్లు దాటిన వారికిచ్చే పెన్షన్‌ను ₹200 నుంచి 500 వరకు పెంచారు.
- దేశంలోని 47.5 లక్షల మంది పనిమనుషులకు రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన కింద బీమా ప్రయోజనాలు కల్పించాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ జూన్ 23న ఆమోదం తెలిపింది.
- భారత్‌లో కోటీశ్వరుల సంఖ్య 1.53 లక్షలకు పెరిగినట్లు 'వరల్డ్ వెల్త్ రిపోర్ట్ ఆఫ్ మెరిల్ లించ్ వెల్త్ మేనేజ్‌మెంట్ అండ్ కాప్‌జెమిని' నివేదిక వెల్లడించింది.
- టైమ్ మ్యాగజీన్ రూపొందించిన గొప్ప నిరసనల జాబితాలో ఉప్పు సత్యాగ్రహానికి చోటు లభించింది.
- కార్మికులకు సంబంధించిన ఒక చట్టంలో లింగ వివక్షకు తావులేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆ చట్టంలో ఉన్న 'వర్క్‌మ్యాన్/వర్క్‌మెన్' అనే పదాలను 'వర్కర్/వర్కర్స్'గా మార్చింది.

- పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళల రిజర్వేషన్లను 33 శాతం నుంచి 50 శాతానికి పెంచేందుకు కేంద్రం జూలై 21న ఆమోదం తెలిపింది. ఇందుకోసం 110వ రాజ్యాంగ సవరణను తీసుకురానున్నారు.
- ప్రధాని మన్మోహన్ సింగ్ ఆగస్టు 15న ఎర్రకోటపై వరుసగా 8వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తద్వారా ఎర్రకోటపై ఎక్కువ సార్లు జెండాను ఎగురవేసిన 3వ ప్రధానిగా ఘనత సాధించారు. ఇప్పటి వరకు జవహర్‌లాల్ నెహ్రూ 17 సార్లు, ఇందిరాగాంధీ 16 సార్లు ఎర్రకోటపై జెండాను ఆవిష్కరించారు. వీరిద్దరి తర్వాత ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన రికార్డు కూడా మన్మోహన్ సింగ్‌దే కావడం విశేషం.
- చెన్నై నగరం ఆగస్టు 22న 372వ ఏట అడుగుపెట్టింది. అప్పటి బ్రిటిష్ పరిపాలనవేత్త ఫ్రాన్సిస్ డే, స్థానిక నాయక్ పాలకులతో కుదుర్చుకున్న భూ ఒప్పందంతో 1639, ఆగస్టు 22న చెన్నై ఏర్పడింది.
- మధ్యప్రదేశ్‌లోని గోవింద్ ఘర్‌లో తెల్ల పులుల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- భారత వృద్ధి రేటు 2011–12 ఆర్థిక సంవత్సరంలో 7.5 నుంచి 7.75 శాతంగా (2010–11లో వృద్ధి రేటు 8.5 శాతంగా నమోదైంది)ఉండొచ్చని ఐఎంఎఫ్ సెప్టెంబర్ 20న విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది.
- దేశంలో మొట్టమొదటి రెండంతస్తుల(డబుల్ డెక్కర్) రైలు.. హౌరా–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌ను హౌరా స్టేషన్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి దినేశ్ త్రివేదీ ప్రారంభించారు.
- ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్(డీఎంఆర్‌సీ)కు ప్రతిష్టాత్మక ఐక్యరాజ్యసమితి గుర్తింపు లభించింది.
- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ జీవితంపై జర్నలిస్ట్ రాణీ సింగ్ రాసిన 'సోనియాగాంధీ: ఏన్ ఎక్స్‌ట్రార్డినరీ లైఫ్, ఏన్ ఇండియన్ డెస్టినీ' పుస్తకానికి సోవియట్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్ ముందు మాట రాశారు.
- ఈశాన్య రాష్ట్రాల్లో భద్రతా దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్‌ఎస్‌పీఏ)ను రద్దు చేయాలని.. ఇంపాల్‌లో దీక్ష చేస్తున్న పౌరహక్కుల కార్యకర్త ఇరోమ్ చాను షర్మిల(39) దీక్షకు నవంబర్ 5 నాటికి 11 ఏళ్లు పూర్తయ్యాయి. నవంబర్ 2, 2000న అస్సాం రైఫిల్స్ బెటాలియన్‌కు చెందిన దళాలు ఇంఫాల్ సమీపంలోని గ్రామంలో 11 మంది పౌరులను కాల్చి చంపాయనే ఆరోపణ చేస్తూ ఏఎఫ్‌ఎస్‌పీఏను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆమె దీక్ష ప్రారంభించారు.
- విద్యా హక్కు చట్టం ప్రచార కార్యక్రమం 'శిక్షా కా హక్ అభియాన్' నవంబర్ 11న ప్రారంభమైంది.
- దేశంలో అతి పొడవైన రైలు సర్వీస్ వివేక్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 19న ప్రారంభమైంది. ఈ రైలు

అసోంలోని దిబ్రూఘర్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి మధ్య నడుస్తుంది. దేశంలో ఇప్పటి వరకు పొడవైన రైలు సర్వీసు జమ్మూతావీ–కన్యాకుమారి మధ్య నడిచే హిమసాగర్ ఎక్స్‌ప్రెస్. దిబ్రూఘర్–కన్యాకుమారి సర్వీస్ ప్రపంచంలో 8వ పొడవైన సర్వీసు. ప్రపంచం లో పొడవైన రైలు సర్వీసు రష్యాలోని మాస్కో–వ్లాడివోస్తోక్(పొడవు 9,259 కి.మీ.).

- ముళ్లైపెరియార్ ప్రాజెక్ట్ ఆధారంగా నిర్మించిన 'డ్యామ్ 999' చిత్రాన్ని తమిళనాడు ప్రభుత్వం నిషేధించింది. తమిళనాడుకు నీరు అందించే ఈ ప్రాజెక్ట్‌ను 1895లో పెరియార్, ముళ్లైయార్ నదుల సంగమ ప్రదేశంలో నిర్మించారు.
- ఆధునిక భారతదేశ రాజధానిగా ఢిల్లీ.. డిసెంబర్ 12, 2011 నాటికి 100 ఏళ్లు పూర్తి చేసుకుంది. నాటి బ్రిటిష్ పాలకులు రాజధానిని కోల్‌కతా నుంచి ఢిల్లీకి 1911, డిసెంబర్ 12న మారుస్తున్నట్లు ప్రకటించారు. కొత్త ఢిల్లీ నిర్మాణానికి బ్రిటిష్ రాజు ఐదో జార్జి, రాణి మేరీలు 1911, డిసెంబర్ 15న శంకుస్థాపన చేశారు.
- పేదలకు సబ్సిడీతో ఆహార ధాన్యాలు అందించేందుకు ప్రతిపాదించిన ఆహార భద్రత బిల్లుకు కేంద్ర కేబినెట్ డిసెంబర్ 18న ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ ప్రతినెలా 7 కిలోల చొప్పున బియ్యం (కిలోకు ₹3), గోధుమలు (కిలోకు ₹2), ఇతర ముతకధాన్యం (కిలోకు ₹1) పంపిణీ చేస్తారు.
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు అజిత్ సింగ్ డిసెంబర్ 18న కేంద్ర కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనకు పౌర విమానయాన శాఖను కేటాయించారు. ఈయన పార్టీ (యూపీఏలో చేరిన 15వ పార్టీ)కి లోక్‌సభలో ఐదుగురు సభ్యులున్నారు. దీంతో లోక్‌సభలో యూపీఏ బలం 272 నుంచి 277కు పెరిగింది.
- అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న పరిధిని విస్తరిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్రీడారంగం సహా ఏ రంగం వారైనా దీన్ని అందుకునే వీలు కల్పించింది. ఇప్పటి వరకు దీన్ని సాహిత్యం, కళలు, సైన్స్, ప్రజా సేవ రంగాలకే పరిమితం చేశారు.
- ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న 27 శాతం రిజర్వేషన్లలో మైనార్టీలకు 4.5 శాతం సబ్ కోటాను కల్పించాలని కేంద్ర కేబినెట్ డిసెంబర్ 22న నిర్ణయించింది.
- జాతీయగీతం 'జనగణమన'కు డిసెంబర్ 27 నాటికి 100 ఏళ్లు పూర్తయ్యాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన ఈ గీతాన్ని తొలి సారి 1911 డిసెంబర్ 27న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు.

- గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 2012ను 'జాతీయ గణిత సంవత్సరంగా' రామానుజన్ జయంతి రోజైన.. డిసెంబర్ 22 ను 'జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం'గా ప్రకటించారు.
- అణు సామర్థ్యం గల నెప్రా జలాంతర్గామి రష్యా నుంచి భారత నావికా దళానికి అందింది. దీంతో ఇలాంటి జలాంతర్గాములను వినియోగిస్తున్న ఆరో దేశంగా భారత్ అవతరించింది. అకుల-2 శ్రేణికి చెందిన ఈ నెప్రాకు 'ఐఎన్ఎస్ చక్ర'గా పేరు పెట్టారు.
- విజయనగరం జిల్లా బొబ్బిలి కళాకారులు తయారు చేస్తున్న వీణలకు పేటెంట్ హక్కు లభించింది. పనస చెట్టు కొయ్యతో చేసే ఈ వీణ భారతదేశంలోని అత్యంత పురాతన సంగీత పరికరాల్లో ఒకటి. దీనికి దాదాపు 160 సంవత్సరాల చరిత్ర ఉంది.
- బంగాళాఖాతంలో డిసెంబర్ 25న ఏర్పడిన తుపానుకు 'థానే' అనే పేరు పెట్టారు.
- ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 99వ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జనవరి 3న ప్రారంభించారు. దీన్ని 'టెక్నాలజీ ఫర్ ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్-రోల్ ఆఫ్ ఉమెన్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని 2010-20 దశాబ్దాన్ని 'డికేడ్ ఆఫ్ ఇన్నోవేషన్'గా ప్రకటించారు.
- ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో రెండు వేల ఏళ్లుగా కొనసాగుతున్న గిరిజన సంప్రదాయ వ్యవసాయానికి ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) గుర్తింపు లభించింది. ఇందుకు సంబంధించి 99వ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రకటన వెలువడింది. ఎఫ్ఏఓ మనదేశానికి ఇటువంటి గుర్తింపునివ్వడం ఇదే తొలిసారి. ప్రపంచ ప్రముఖ వ్యవసాయ వారసత్వ ప్రదేశాల కార్యక్రమం కింద కొరాపుట్ వ్యవసాయానికి ఈ ఘనత దక్కింది.
- బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ 'గేట్స్ వాక్సిన్ ఇన్నోవేషన్' అవార్డుకు ఎంపికయ్యారు.
- రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో 10వ ప్రవాసీ భారతీయ దివస్ జనవరి 7 నుంచి 9 వరకు జరిగింది. 'ప్రపంచ భారతీయుడు- సమ్మిళిత వృద్ధి' అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించారు.
- పుట్టిన తేదీకి సంబంధించిన కేసులో భారత సైనికదళాల ప్రధానాధికారి జనరల్ వీకే సింగ్ అసాధారణ రీతిలో జనవరి 16న సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సర్వీసులో ఉన్న సైనిక దళాల సారధి ఇలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం.
- బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాకు త్రిపుర కేంద్రీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

- దేశంలో 42 శాతం మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని 'హంగామా (హంగామా-హంగర్ అండ్ మాల్ న్యూట్రిషన్)' నివేదిక పేర్కొంది. నాందీ ఫౌండేషన్ రూపొందించింది.
- భారత ఆర్థిక వ్యవస్థ 2012లో 7.7 శాతం వృద్ధి సాధిస్తుందని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది. ఈ వృద్ధి 2013లో 7.9 శాతంగా ఉంటుందని పేర్కొంది. 'ప్రపంచ ఆర్థిక స్థితి, అవకాశాలు-2012' అనే నివేదికలో ఐక్యరాజ్యసమితి ఈ వివరాలను వెల్లడించింది.
- 2012 జైపూర్ సాహిత్య ఉత్సవాలను క్వీన్ మదర్ ఆఫ్ భూటాన్ ఆషి సాంగీ చోదెన్ వాంగ్‌చుక్ జనవరి 20న ప్రారంభించారు. ఇది ఆసియా - పసిఫిక్ ప్రాంతంలో జరిగే అతి పెద్ద సాహిత్య ఉత్సవం. ఈ ఉత్సవాలకు హాజరు కావల్సిన వివాదాస్పద రచయిత సల్మాన్ రష్దీ భద్రతా కారణాల రీత్యా.. తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ ఉత్సవాలను 2006 నుంచి నిర్వహిస్తున్నారు.
- శాంతి సమయంలో ఇచ్చే అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర' సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ నవదీప్ సింగ్‌కు మరణానంతరం లభించింది. రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తి చక్ర' ముగ్గురికి లభించింది. లెఫ్టినెంట్ సుశీల్ ఖజురియా (మరణానంతరం), లెఫ్టినెంట్ కల్నల్ కమల్‌దీప్ సింగ్ (రాష్ట్రీయ రైఫిల్స్, మరణానంతరం), రాజ్‌పుటానా రైఫిల్స్‌కు చెందిన కెప్టెన్ అశుతోష్ కుమార్‌లకు ఈ పురస్కారం దక్కింది. మరో తొమ్మిది మందికి (ఇద్దరికి మరణానంతరం) 'శౌర్య చక్ర' పురస్కారాలు లభించాయి.
- ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్ జి.మాధవన్ నాయర్‌తోపాటు మరో ముగ్గురు శాస్త్రవేత్తలపై కేంద్రప్రభుత్వం జనవరి 25న నిషేధం విధించింది. ఇస్రో వాణిజ్య విభాగమైన 'యాంట్రిక్స్ కార్పొరేషన్'- దేవాస్ మల్టిమీడియా లిమిటెడ్ వివాదాస్పద ఒప్పందంలో వారి పాత్ర నిర్ధారణ కావడంతో ఈ చర్యలు తీసుకుంది.
- భారతదేశ 63వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో థాయ్‌లాండ్ ప్రధానమంత్రి ఇంగ్లక్ షినవత్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
- గత ఆర్థిక సంవత్సరం(2010-11) స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటును 8.5 శాతం నుంచి 8.4 శాతానికి తగ్గించినట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తెలిపింది.
- 2010-11 ఆర్థిక సంవత్సరంలో వార్షిక తలసరి ఆదాయం 15.6 శాతం పెరిగి రూ.53,331కి చేరింది. అంతక్రితం ఏడాది ఇది రూ.46,117 మాత్రమే.

- దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2011-12 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 250.42 మిలియన్ టన్నులకు చేరనున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ ఫిబ్రవరి 3న విడుదల చేసిన గణంకాలు పేర్కొన్నాయి.
- బంగ్లాదేశ్‌కు చెందిన వివాదాస్పద రచయిత్రి తస్లిమా నస్రీన్ స్వీయ చరిత్రలోని ఏడో భాగం 'నిర్బాసన్ (బహిష్కరణ)' పుస్తకాన్ని ఫిబ్రవరి 1న కోల్‌కతాలో విడుదల చేశారు.
- సైనిక దళాల కొత్త అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ బిక్రమ్ సింగ్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మార్చి 3న ప్రకటించింది.
- గోవా ముఖ్యమంత్రిగా బీజేపీకి చెందిన మనోహర్ పారికర్ మార్చి 8న ప్రమాణ స్వీకారం చేశారు.
- ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ఎం.పి. విజయ్ బహుగుణ మార్చి 13న ప్రమాణ స్వీకారం చేశారు.
- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా అఖిలేష్ యాదవ్ (38) ఎంపికయ్యారు.
- పంజాబ్ ముఖ్యమంత్రిగా శిరోమణి అకాళీదల్‌కు చెందిన ప్రకాష్ సింగ్ బాదల్ ఐదోసారి మార్చి 14న ప్రమాణస్వీకారం చేశారు.
- కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఓక్రామ్ ఇబోబి సింగ్ మణిపూర్ 23వ ముఖ్య మంత్రిగా మార్చి 14న ప్రమాణ స్వీకారం చేశారు.
- **కేంద్ర బడ్జెట్ 2012 – 13 ముఖ్యాంశాలు: మొత్తం బడ్జెట్ వ్యయం:** ₹ 14,90,925 కోట్లు, **ప్రణాళికా వ్యయం:** ₹ 5,21,025 కోట్లు, **ప్రణాళికేతర వ్యయం:** ₹ 9,69,900 కోట్లు, **2012-13లో పన్ను వసూళ్ల అంచనా:** ₹ 7,71,071 కోట్లు, **పన్నేతర రెవెన్యూ వసూళ్లు:** ₹ 1,64,614, **రుణేతర మూల ధన వసూళ్లు:** ₹ 41,650 కోట్లు, **2012-13లో జీడీపీలో విత్తలోటు:** ₹ 5.1 శాతం, (ఇది 2011-12లో 5.9 శాతం), **జీడీపీలో కేంద్ర ప్రభుత్వ రుణాలు:** 45.5 శాతం
- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి 2 లక్షల రూపాయలకు పెంపు
- సర్వీస్ టాక్స్, ఎక్సైజ్ సుంకం 10 శాతం నుంచి 12 శాతానికి పెంపు. **ప్రధాన కేటాయింపులు: రక్షణ రంగం:** ₹1,93,407 కోట్లు,**జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్:** ₹ 20,822 కోట్లు,**సర్వశిక్ష అభియాన్‌కు కేటాయింపు:** ₹ 25,555 కోట్లు
- కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా తృణమూల్ కాంగ్రెస్ నేత ముకుల్ రాయ్ మార్చి 20న ప్రమాణ స్వీకారం చేశారు.
- దేశంలో తొలి బ్రెయిలీ వార్తాపత్రిక 'రిలయన్స్ దృష్టి'ని మార్చి 19న ముంబైలో ఆవిష్కరించారు. ఇది హిందీ భాషలో పదిహేను రోజులకోసారి వెలువడుతుంది.

- మిస్ ఇండియా–2012గా చండీగఢ్‌కు చెందిన వన్య మిశ్రా ఎంపికయ్యారు. మిస్ ఇండియా ఎర్త్ టైటిల్‌ను ప్రాచీ మిశ్రా గెలుచుకోగా, మిస్ ఇండియా ఇంటర్నేషనల్‌గా రోఛెల్లీ మరియా రావు నిలిచింది.
- ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో కూడిన పారామిలటరీ పైప్ బ్యాండ్(సంగీత బృందం) ను కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం(సీఆర్‌పీఎఫ్) ఏర్పాటు చేసుకుంది.
- భారత్–అమెరికా నౌకా దళాల 16వ ఉమ్మడి శిక్షణ కార్యక్రమం చెన్నై, అండమాన్ నికోబార్ దీవుల సమీపంలోని భారత సముద్ర తీరంలో ఏప్రిల్ 7న ప్రారంభమైంది. దీనికి 'మలబార్–2012' అనే పేరు పెట్టారు.
- భారత్‌లో పాకిస్థాన్ నూతన రాయబారిగా సల్మాన్ బషీర్ నియమితులయ్యారు.
- మతంతో సంబంధం లేకుండా వివాహాల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 12న నిర్ణయం తీసుకుంది. బాల్య వివాహాలను అరికట్టటానికి వివాహాల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని ఇప్పటికే సుప్రీంకోర్టు, 18వ లా కమిషన్ స్పష్టం చేసిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్య తీసుకుంది. సిక్కుల వివాహాలను హిందూ వివాహ చట్టం కింద కాకుండా 'ఆనంద్ వివాహ చట్టం –1909' కింద ప్రత్యేకంగా నమోదు చేయాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌ను కేంద్రం ఆమోదించింది.
- దేశంలో తొలిసారిగా భారతీ ఎయిర్‌టెల్ 4జీ టెలికాం సేవలను ఏప్రిల్ 10న కోల్‌కతాలో ప్రారంభించింది.
- సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ మధ్య రైల్వే, పశ్చిమ రైల్వే జోన్లకు సంయుక్తంగా గోవింద్ వల్లభ్ పంత్ అవార్డు లభించింది.
- ఆసియా ఖండంలోనే అతి పెద్ద సౌర శక్తి విద్యుత్ కేంద్రాన్ని గుజరాత్‌లోని పఠాన్ జిల్లా చరంకా వద్ద ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న ప్రారంభించారు.
- క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, హిందీ సినీనటి రేఖతో పాటు పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త అనూ అగాలను రాష్ట్రపతి ఏప్రిల్ 26న రాజ్యసభకు నామినేట్ చేసారు. రాజ్యాంగంలోని 80వ ప్రకరణ ప్రకారం సైన్స్, సాహిత్యం, కళలు, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలు చేసిన 12 మందిని రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేస్తారు.
- భారతప్రభుత్వ క్రెడిట్ రేటింగ్‌ను గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్ అండ్ పీ) ఏప్రిల్ 25న ప్రస్తుతమున్న స్థిరస్థాయి BBB+ నుంచి BBB- ప్రతికూల స్థాయికి తగ్గించింది.

- మలేరియా వ్యాధికి దేశీయంగా తొలిసారి ర్యాన్‌బాక్సీ లేబొరేటరీస్ తయారుచేసిన మందు సిన్‌రియంను న్యూఢిల్లీలో ఏప్రిల్ 25న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి గులామ్ నబీ ఆజాద్ మార్కెట్‌కు విడుదల చేశారు.
- అటార్నీ జనరల్‌గా గులామ్-ఇ-వాహన్‌వతిని రాష్ట్రపతి ఏప్రిల్ 30న తిరిగి నియమించారు.
- స్కాట్‌లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ జీవితం, ఆయన రచనలపై అధ్యయనానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- పార్లమెంట్ తొలి సమావేశం జరిగి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మే 13న లోక్‌సభ, రాజ్యసభలు ప్రత్యేకంగా కొలువుదీరాయి. ఈ సందర్భంగా తొలి లోక్‌సభకు చెందిన నలుగురు సభ్యులను మే 13న ఘనంగా సత్కరించారు. వీరిలో రిషాంగ్ కేషింగ్(మణిపూర్), రేషమ్‌లాల్ జాంగ్డే(ఛత్తీస్‌గఢ్), మన రాష్ట్రానికి చెందిన కందాళ సుబ్రహ్మణ్య తిలక్(92), కానేటి మోహనరావు (87)లు ఉన్నారు. పార్లమెంట్ వజ్రోత్సవాల సందర్భంగా రూ. 5, రూ. 10 స్మారక నాణేలను రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ విడుదల చేశారు.
- ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, మణిపూర్, మేఘాలయాలకు ప్రత్యేక హైకోర్టులను ఏర్పాటు చేసే బిల్లును లోక్‌సభ మే 12న ఆమోదించింది. ప్రస్తుతం ఆరు ఈశాన్య రాష్ట్రాలు – త్రిపుర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో గౌహతీ హైకోర్టు బెంచ్‌లు ఉన్నాయి. సిక్కింకు మాత్రమే ప్రత్యేక హైకోర్టు ఉంది. త్రిపుర, మణిపూర్, మేఘాలయాలు జనవరి 21, 1972న రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. ఈ రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు లేవు.